# విప్లవకారుడు

ఆయన పెళ్ళి చేసుకున్నాడు. ఆయన పూజా మందిరంలో ఉన్న దేవుడు గాక, ఆవిడ ఒక దేవతను తెచ్చింది. ఇద్దరూ కీచులాడుకున్నారు. పూజా మందిరంలో అగ్రస్థానం దేవుడిదా, దేవతదా?

పురోహితుణ్ని పిలిచారు. "మీరు అనవసరంగా కీచులాడుతున్నారు. ఆ దేవత ఆ దేవుడికి భార్యే తప్పవిడిచి మరొహటి ఏమిటిన్నూ కాదు!" అన్నాడు పురోహితుడు.

భార్యాభర్తలకు రాజీ కుదిరింది. వాళ్ల కడుపున నాలుగు కాయలు కాశాయి. స్వతంత్ర భారతంలో వాళ్లు విదేశీ చదువులు చదివితే గాని పైకిరారని, తల్లిదండ్రులు వాళ్లను క్రైస్తవ బళ్లలో వేశారు. వాళ్లు చదువు పూర్తి అయే లోపల ఏసుక్రీస్తే దేవుడనీ, సిలువను మెడలో తగిలించుకుని కళ్లకు అద్దుకోవచ్చుగాని, దేవుళ్లనూ, దేవతలను పూజించటం మూఢవిశ్వాసమనీ అన్నారు.

మళ్లీ సంఘర్షణ మొదలయింది. పురోహితుణ్ని పిలిచారు.

"క్రీస్తు అనగా ఎవరు? మన కృష్ణుడే, జైల్లో పుట్టాడు. అసలు దేవుడు ఒకడే. మనం అతనికి ఏవేవో పేర్లు పెట్టుకుని తగాదా పడతాం తప్ప విడిచి మరొకటి ఏమిన్నూ లేదు" అన్నాడు పురోహితుడు.

కూతురికి పెళ్లి చేశారు. అల్లుడు అత్తవారింటికి వచ్చి పూజా మందిరం నిండే దేవతలనూ, గోడల మీద ఏసుక్రీస్తూ పటాలనూ చూసి, "మీ మొహాలు మండి మీరింకా ఈ రాతి యుగంలోనే ఉన్నారా?" అంటూ విగ్రహాలనూ పటాలను విసురుపుచ్చుకుని వీథిలో పారేశాడు.

మామగారూ, బావమరుదులూ అతన్ని విప్లవకారుడని పోలీసులకు అప్పగించారు. అతని మీద నాస్తికుడని చార్జి పెట్టలేదు; ఆస్తి హక్కులను విరోధి అనీ, సాయుధ విప్లవవాది అనీ రాజ్యాంగాన్ని నాశనం చేయజూస్తున్నాడనీ వేరు వేరు సెక్షన్లకింద చార్జీ చేశారు.

అన్ని ఆరోపణలూ నిజమేనని అల్లుడు ఒప్పేసుకున్నాడు.

***ముద్రణ : యువ, జనవరి 1978***